

దండేపల్లి: మేదరిపేటలో మైసమ్మకు పూజలు

జన్నారం: పొనకల్ చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు





రామకృష్ణాపూర్: చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



భీమినిలో బతుకమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఎంపీపీ, ప్రజలు



మందమర్రిరూరల్: ఆదిల్‌పేట్‌లో...



నెన్నెల: కుమ్మరివాగు చెరువు వద్ద ర్యాలీ



తాండూర్: బోనాలతో ఊరేగింపు



కొమ్మెరలో దప్పుచప్పుళ్లతో చెరువు వద్దకు వెళ్తున్న గ్రామస్తులు



బెల్లంపల్లిరూరల్: మాలగురిజాలలో బోనాలతో ఊరేగింపుగా..

ఊరూరా చెరువుల పండుగ

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలు, బోనాలతో కోలాటమాడుతూ సామూహికంగా, దప్పు చప్పుళ్లతో ర్యాలీగా చెరువుల వద్దకు వెళ్లి కట్టమైసమ్మకు పూజలు జరిపారు. మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. డీజే పాటలకు బతుకమ్మ ఆటలు, నృత్యాలు చేశారు. వేడుకల్లో చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. దీంతో చెరువుల వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. తొమ్మిదేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని పలువురు వివరించారు. హాజీపూర్‌లో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొనగా పలుచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జైపూర్: భోనాలతో తరలివెళ్తున్న మహిళలు



కాసిపేట: మామిడిగూడలో...



గుడిపేట చెరువు కట్టపై బతుకమ్మలు, బోనాలతో మహిళలు



వేమనపల్లి: ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కోటపల్లి: వెంచపల్లిలో...



భీమారం: దాంపూర్‌లో బతుకమ్మ సంబురాల్లో మహిళలు

క్లుప్తంగా

పునరావాస ప్యాకేజీ చెల్లించాలని వినతి



ఎంపీని కలిసిన మేడిపల్లి గ్రామస్తులు

పాతమంచిర్యాల: మేడిపల్లి ఓసీపీ విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ, కరువు భత్యం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేతను కలిసి విన్నవించారు. స్పందించిన ఎంపీ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ విషయమై సింగరేణి అధికారులతో మాట్లాడారు. నిర్వాసితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని, నెల రోజుల్లో నిర్వాసితుల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర మార్షల్ దుర్గం నగేష్, బండారీ శివశంకర్, మేడిపల్లి గ్రామస్తులు సానపురి శ్రీనివాస్, రామటెంకి మల్లేష్, మేకల లింగయ్య, చందనగిరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'దురుసుగా ప్రవర్తించడం సరికాదు'.

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కార్మికులతో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం సరికాదని హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ ఉపాధ్యక్షుడు చిప్పకుర్తి సంపత్ తెలిపారు. పవర్ ప్లాంట్‌లో విధులకు హాజరవుతున్న సమయంలో లోపలి గేట్ వద్ద సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది కాంట్రాక్టు కార్మికులను మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేస్తున్నారని అన్నారు. గేటు లోపలి నుంచి బయటకు వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అడిగితే గేట్‌పాస్‌లు లాక్కుని కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికులతో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా మాట్లాడడం బాధాకరమన్నారు. ఇదే విషయాన్ని సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లుగా సంపత్ తెలిపారు.

'మా హాస్టల్ భవనం మాకే కావాలి'

మంచిర్యాలఅర్బన్: ప్రస్తుత కలెక్టర్ భవనం ఖాళీ చేసే క్రమంలో సాంఘిక సంక్షేమశాఖ నిధులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో 2014లో నిర్మించిన సోషల్ వెల్ఫేర్ మహిళా వసతి గృహ భవనం మాకే కేటాయించాలంటూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులమైన మేం చేసిన పాపం ఏంటో తెలపాలని కోరారు. కలెక్టర్ కార్యాలయం కొనసాగుతుండటంతో అద్దె భవనంలో, అసౌకర్యాల మధ్య బాలికల వసతి గృహం నిర్వహిస్తున్నందని ఎమ్మెల్యేకు తెలియంది కాదంటూ వాపోయారు. హాస్టల్ నుంచి కళాశాలకు ఎనిమిది కిలోమీటర్ల మేర దూరం నుంచి నడిచి వస్తున్నామన్నారు. మా హాస్టల్ భవనం మాకే కేటాయించాలని విద్యార్థుల పేరిట విడుదలైన లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.

'బీఆర్ఎస్ ఆఫీస్‌కు కరెంట్ కట్ చేయాలి'

మంచిర్యాలఅగ్రికల్చర్: బీఆర్ఎస్ భవన్‌కు అందించిన అక్రమ విద్యుత్ కనెక్షన్ తొలగించాలని ఆమ్‌ఆద్మీపార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఏడీ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమ్‌ఆద్మీపార్టీ మంచిర్యాల నియోజకవర్గ కో ఆర్డినేటర్ నాయింపాష మాట్లాడుతూ.. నస్పూర్ మండలం కలెక్టర్ నూతన కార్యాలయం పక్కన నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మున్సిపల్ అనుమతులు లేకుండా కట్టినట్లు ఆరోపించారు. విద్యుత్‌వాడకం నిర్మాణం నుంచి ఇప్పటివరకు రూ.50వేల విద్యుత్ బకాయి ఉందని, అయినప్పటికీ విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. సామాన్యుల బిల్లు పెండింగ్ ఉంటే కనెక్షన్ తొలగించే అధికారులు, బీఆర్ఎస్ కార్యాలయం బకాయిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శ్రీ కాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వలకు చిక్కిన పెద్ద చేప



నెన్నెల: మండలంలోని కుమ్మరివాగు ప్రాజెక్టులో మృగశిర సందర్భంగా చేపల వేటకు వెళ్లిన జాలరికీ 12 కిలోల చేప చిక్కింది. ఇది బొచ్చరకం చేప అని, మంచి ధర లభిస్తుందని జాలరి సంతోషం వ్యక్తం చేశాడు. రూ.200 చొప్పున విక్రయించగా రూ.2200 వచ్చినట్లు తెలిపాడు. కుమ్మరివాగు, మత్తడివాగు, గంగారాం ఊర చెరువుల్లో జాలర్లు చేపలు పట్టారు. సాధారణంగా చేప కిలో రూ.100 ఉండగా మృగశిర రోజున రూ.200లకు పెంచి విక్రయించారు. బొమ్మ చేప కిలో రూ.200 ఉండగా మిరుగు రోజు కావడంతో రూ.300 నుంచి రూ.400లకు విక్రయించారు.

టచ్ ఆసుపత్రిలో క్యాత్‌ల్యాబ్ సేవలు ప్రారంభం



వైద్య పరికరాల పనితీరును ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఆసుపత్రి వైద్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో గల టచ్ ఆసుపత్రిలో గురువారం కార్డియాలజీ విభాగానికి సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే మొట్టమొదటి సారిగా యాంజియోగ్రామ్, గుండెకు స్టంట్లు వేసే ఫిలిప్స్ ఎఫ్‌డీ 10 అడ్వాన్స్‌డ్ క్యాత్‌ల్యాబ్‌ను మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా టచ్ ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ.. ఇక నుంచి గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి, అత్యవసర సేవలను దూరప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలోనే ఎల్లవేళలా అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. జిల్లాలోనే టచ్ ఆసుపత్రిలో జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, యూరాలజీ, ట్రామ, క్రిటికల్ కేర్‌తో పాటు నేటి నుంచి గుండె వైద్యానికి సంబంధించి పూర్తి స్థాయి పరికరాలను సమకూర్చుకోవడమే కాకుండా చుట్టు పక్కల జిల్లాలతో పాటు, మహానగరాలకు ధీటుగా సంపూర్ణ గుండె వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, టీఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ రామ్ మోహన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, పుర ప్రముఖులు, ఐఎంఏ డాక్టర్స్, టచ్ ఆసుపత్రి డాక్టర్స్, టచ్ ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

'సుదర్శన్ మృతి ప్రజలకు తీరనిలోటు'

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



నివాళులర్పిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

బెల్లంపల్లిరూరల్: మావోయిస్టు పార్టీ అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ మృతి పేద ప్రజలకు తీరని లోటు అని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. దండకారణ్యంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సుదర్శన్‌కు గురువారం నివాళులర్పించారు. బెల్లంపల్లిలోని సుదర్శన్ సోదరుడు కటకం సతీష్‌కుమార్ ఇంటికి వచ్చి సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుముల శంకర్, సూరం రవీందర్ రెడ్డి, రొడ్డ శారద, మాజీ సీఐడీ, అడిషనల్ ఎస్పీ రవికుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్ రాజు, కాంగ్రెస్ శ్రేణులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీసీబంధు అమలు చేయాలి

నస్పూర్: బీసీల సంక్షేమం కోసం బీసీలకు వెంటనే బీసీ బంధు అమలు చేయాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. బీసీలలోని పలు చేతివృత్తుల వారికి ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అన్ని కులస్తుల వారికి అమలు పర్చాలన్నారు. రూ.లక్ష ఆర్థిక సాయాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

యువకుడికి గాయాలు

వేమనపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని పెట్రోల్‌బంక్ మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడగా, దస్నాపూర్ గ్రామానికి చెందిన నాయిని రాములు తీవ్ర గాయాలపాలయ్యాడు. మద్యం సేవించి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు, 108 వాహనంలో మంచిర్యాల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

అండర్ మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైనందుకు ఎస్సార్పీ 3, 3ఏ గని అండర్ మేనేజర్ అరుణ్‌కుమార్‌ను కార్మికులు, అధికారులు ఘనంగా సన్మానించారు.

'కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటాం'

బెల్లంపల్లిరూరల్: ప్రజలను మరోసారి మోసం చేయడానికే సీఎం కేసీఆర్ మంచిర్యాల పర్యాటనకు వస్తున్నారని, ఆయన రాకను అడ్డుకుంటామని బీజేపీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు రమేష్ అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం మా ట్లాడారు.

చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: జిల్లా విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని, అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత అన్నారు.

హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడి బహిరంగ లేఖ



మాట్లాడుతున్న కేవీ ప్రతాప్

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తర్వాత ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్ సీఎంకు బహిరంగ లేఖను రాశారు. ఈ సందర్భంగా గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరిట ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నడిచి, అందుకు అనుగుణంగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నామని, ఇందుకోసం 1200మంది అమరులు వారి ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. అమరుల కుటుంబాలను ఆదుకోవాలని, ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని, తెలంగాణలో జరిగిన రెండుసార్లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో రైతుల రుణమాఫీ ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని, మిషన్ భగీరథ నీరు అన్ని గ్రామాలకు చేరడం లేదని, పోడు భూముల పంపిణీ, గిరిజన, దళితులకు మూడెకరాల భూమి ఎందుకివ్వలేదని, ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదని, ప్రతి మండలంలో 30పడకల ఆసుపత్రి నిర్మించలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్, కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్, ధీటి రవి, నల్ల రవి, ఆవునూరి రాజ్‌కుమార్, కొమురవెల్లి శ్రీధర్, గడ్డం సతీశ్ యాదవ్, దుర్గం ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



దండేపల్లి: వెల్‌బేబీషోలో చిన్నారులు

చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి/ మంచిర్యాలటౌన్/కాసిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి రామ్మూర్తి అన్నారు. గురువారం చెన్నూర్ రూరల్ మండలంలోని ఆస్నాద్ గ్రామంలో పర్యటించి ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను వివరించారు. బెల్లంపల్లి మండలం దుగ్నెపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో ఉమాదేవి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులను అంగన్‌వాడీలకు పంపాలన్నారు. దండేపల్లి మండలంలోని మేదరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో వెల్‌బేబీషో ఆకట్టుకుంది. అనంతరం సూపర్ వైజర్ వాణి పిల్లల ఎత్తు, బరువులు, కొలతలు తీశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ బడిబాట నిర్వహించి, చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. కాసిపేటలోని దేవాపూర్, కాసిపేట, ముత్యంపల్లి పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ప్లకార్డులు, ర్యాలీలు నిర్వహించారు.

కల(ళా)వేదిక..!

- స్థలకేటాయింపే అసలు సమస్య
- రూ.రెండున్నర కోట్ల నిధులు వెనక్కి
- బడుల్లోనే కళాప్రదర్శనలు
- ముఖ్యమంత్రి కేసీఆర్ పైనే గంపెడాశలు

మంచిర్యాలఅర్బన్: సాహితీవేత్తలు, నృత్య, వృత్తి కళాకారులకు నిలయమైన మంచిర్యాలలో కళావేదిక (ఆడిటోరియం) కలగానే మిగిలిపోతుంది. బుల్లితెర నుంచి వెండితెరపై ప్రదర్శించిన నటీనటులు ఉన్నా ఈ ప్రాంతంలో ఆడిటోరియం హామీగానే మిగిలిపోతుంది. కళా ప్రదర్శనలు, సాహితీ సమావేశాలు నిర్వహించాలంటే గుడులు, బడులను ఆశ్రయించక తప్పని పరిస్థితి. అప్పట్లో మంచిర్యాల జిల్లాకు చెందిన తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) చైర్మన్‌గా పుస్కూర్ రామ్మోహన్‌రావు బాధ్యతలు చేపట్టడం.. మూడేళ్ల క్రితం ఆడిటోరియం కోసం రూ. రెండున్నర కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఎఫ్‌డీసీకి చెందిన అధికారులు కూడా భూదాన్‌లో స్థల పరిశీలన చేశారు. ఏమైందో ఏమోగానీ ఆడిటోరియం కోసం సర్వే చేసి భూ కేటాయింపులో ఎనలేని జాప్యం జరిగింది. జిల్లా ఆడిటోరియానికి వచ్చిన రెండున్నర కోట్లు నిధులు వెనక్కి మళ్లాయి. తర్వాత ఆడిటోరియం ఊసేలేకుండా పోయింది. ఈ నెల 9న జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్న నేపథ్యంలో ఆడిటోరియం ప్రకటిస్తారని ఆశతో కళాకారులు ఎదురు చూస్తున్నారు.

కళా ప్రదర్శనలకు ఇబ్బందులు...

కళను ప్రదర్శించాలంటే కళాకారులకు పాఠశాలలు వేదికగా మారుతున్నాయి. మరోవైపు వేలాది రూపాయలు ఖర్చుచేసి ప్రైవేట్ ఫంక్షన్ హాల్ తీసుకున్నా, అద్దె చెల్లించటం కళాకారులకు ఆర్థికభారమే. అంతేకాకుండా యేటా ప్రభుత్వం నిర్వహించే యువజనోత్సవాల నుంచి మొదలుకుని నృత్యకళాకారులు, సాహితీప్రియులు ఆటలపోటీలు ఏదైనా పాఠశాలలే వేదికగా మారుతున్నాయి. ఇటీవల విడుదలైన బలగం రైటర్ శ్రీకాంత్, తెలంగాణ యాషలో భాషకు ప్రాణంపోసిన దసరాకు రంగు సురేష్ వరకు ఎంతో మంది కళాకారులున్నారు. సినీ సంగీత, గేయ రచయిత తైదల బాపు, రుద్రరూపాయ నమహ: ప్రొడ్యూసర్ రావుల రమేష్, జూన్ 23న విడుదల కానున్న 'కుట్ర' సినిమాకు దర్శకత్వం వహించిన సిరిపురం రాజేశ్ అడ్వకేట్ మంచిర్యాలకు చెందిన వారే. సింగరేణి కార్మికవాడల్లో ఉండే జీవన విధానాన్ని ప్రతిబింభించి రూపొందించిన 'పరేషాన్' సినిమా మంచిర్యాల, గాంధారిఖిలాలో చిత్రీకరించారు. సినిమా డైరెక్టర్ రూపాక్ రోనాల్డ్ సన్, పాటల రచయిత అక్కల చంద్రమౌళితో పాటు పలు సినిమాలకు దర్శకత్వం వహించిన తిరుపతివర్మ వెండితెరకు జిల్లాకు చెందిన ఎంతో మంది కళాకారులను పరిచయం చేశారు. దాదాపుగా మంచిర్యాల పట్టణంలోనే 20పైగా డ్యాన్స్ ఇనిస్టిట్యూట్స్ నిర్వహిస్తూ, కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. కళావేదిక లేకపోవటం వల్ల నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు, తమ ప్రదర్శనలు పాఠశాల స్థాయి వరకే పరిమితం అవుతుందనే అభిప్రాయాలు లేకపోలేదు. అప్పట్లో సింగరేణి, ఓరియంట్ సిమెంట్ పరిశ్రమల్లో కార్మికుల వినోదనాన్ని పంచేందుకు క్లబ్‌లు ఏర్పాటు చేసి పరద సినిమాలు, కల్చరల్ పోగ్రాంలు నిర్వహించినా, ప్రస్తుతం అటువంటి పరిస్థితులు ఎక్కడా కనిపించటం లేదు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆడిటోరియానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆడిటోరియం ఏర్పాటు చేయాలి

కళా వేదిక లేకపోవటంతో కళాకారులు ప్రదర్శనలు ఇవ్వలేకపోతున్నారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించాలంటే ప్రయివేట్ ఫంక్షన్ హాలు ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక భారం పడుతుంది. వేదిక అనేది ఉంటే కళకారులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. జిల్లాకు ముఖ్యమంత్రికేసీఆర్ జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆడిటోరియం ప్రకటన చేస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నాం.

– అర్జున్, డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు

సబ్‌జైలు సందర్శన



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

లక్సెట్టిపేట: స్థానిక సబ్‌జైలును మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ గురువారం సందర్శించారు. సబ్‌జైలులోని అండర్ ట్రయల్ ఖైదీలతో మాట్లాడి వారి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, పరిసరాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జైలర్ స్వామి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.